## నేడు దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

శంషాబాద్ రూరల్, నవంబర్ 28: నేడు శంషాబాద్ పట్టణంలోని రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో తలపెట్టిన దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరక్టర్ బుర్కుంట సతీష్ కోరారు. శుక్రవారం శంషాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## 4 నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

హిమాయత్‌నగర్,నవంబర్ 28: డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు డిసెంబర్ 4 నుంచి 16 వరకు మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని నారాయణగూడలోని బాబూ జగ్జీవన్ రామ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్, పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ బాలస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ వంటి కోర్సులో మొదటి సంవత్సం చదువుతున్న విద్యార్థులు సకాలం లో పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

## కేబీఆర్ పార్కు వద్ద వీధి దీపాల ప్రారంభం

బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన 60 డెకొరేటివ్ పోల్స్‌ను, వీధిదీపాలను జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గురువారం సాయంత్రం ప్రారంభించారు. పార్కుకు వచ్చే వాకర్లతో పాటు ప్రయాణికులకు ఆహ్లాదకరమైన ఫీలింగ్‌ను అందించేందుకు వీటిని ఏర్పాటు చేశామని మేయర్ తెలిపారు.
– బంజారాహిల్స్,నవంబర్ 28

# యూసుఫ్‌గూడ ట్రాఫిక్ జంక్షన్ పనులు వేగవంతం చేయండి

### కార్పొరేటర్ దేదీప్య విజయ్‌తో కలిసి పర్యటించిన జడ్సీ ఉపేందర్ రెడ్డి

యూసుఫ్‌గూడలో కార్పొరేటర్ దేదీప్య విజయ్‌తో కలిసి పర్యటిస్తున్న జడ్సీ ఉపేందర్ రెడ్డి

జూబ్లీహిల్స్,నవంబర్ 28 : యూసుఫ్‌గూడ ట్రాఫిక్ జంక్షన్ అభివృద్ధి, రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం యూసుఫ్‌గూడ సర్కిల్ మధురానగర్‌లో వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్‌తో కలిసి పర్యటించారు. యూసుఫ్‌గూడలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ, రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అంబేద్కర్ సర్కిల్‌లో ట్రాఫిక్ జంక్షన్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా యూసుఫ్‌గూడ బస్తీ కూడలి నుంచి జీహెచ్ఎంసీ కార్యాలయం మీదుగా కృష్ణకాంత్ పార్కు రోడ్డులోని సాయిబాబా టెంపుల్ వరకు చేపట్టనున్న రోడ్డు వెడల్పు ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా యూసుఫ్‌గూడ చౌరస్తా నుంచి చేపట్టనున్న రోడ్డు విస్తరణలో ఇండ్లు, స్థలాలు నష్టపోతున్న మధురానగర్ కాలనీ వాసులు జడ్సిని కలిసి తాము నష్టపోకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా రోడ్డు వెడల్పుకు ఇప్పటికే చేపట్టిన అలైన్‌మెంట్‌కు ప్రత్యామ్నాయ ప్రతిపాదనల అవకాశాన్ని పరిశీలించాలని జడ్సి ఉపేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా, జీహెచ్ఎంసీ సిటీ ప్లానర్ శ్యామ్ కుమార్, సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణవేణి, ఈఈ రాజ్‌కుమార్, డిప్యూటీ ఈఈ రామచంద్రరాజు, ఎలక్ట్రికల్ డిప్యూటీ ఈఈ మల్లికార్జున్, ఏఎంఓహెచ్ డాక్టర్ సాల్మన్, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీవరేజ్ లైన్ పనులు ప్రారంభం

బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని బోళానగర్‌లో రూ.10.5లక్షల వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ పైపులైన్ పనులను గురువారం సాయంత్రం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. బస్తీలో మురుగు సమస్యలను పరిష్కరించేందుకు కొత్త లైన్ వేయిస్తున్నామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు. – బంజారాహిల్స్, నవంబర్ 28

విద్యార్థులు ప్రదర్శించిన మాయబజార్, రేసుగుర్రం నృత్య ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి. గురువారం స్లేట్ స్కూల్ 18వ వార్షికోత్సవాన్ని రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్కూల్ డైరెక్టర్ వాసిరెడ్డి అమర్నాథ్ జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థుల నృత్య ప్రదర్శనను ప్రారంభించారు. ప్రిన్సిపాల్స్ స్వప్న, నీలిమ తదితరులు పాల్గొన్నారు. –రవీంద్రభారతి,నవంబర్ 28:

## ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రేంపావని

హిమాయత్‌నగర్,నవంబర్ 28: రాష్ట్రంలోని ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేంపావని, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లపై ప్రభుత్వం పని ఒత్తిడి పెంచడం వల్ల ఆశ వర్కర్లు అనారోగ్యాలకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ల పేరుతో రోజు రోజుకు వారిపై పనిభారం పెంచుతూ శ్రమ దోపిడీకి గురి చేస్తుందన్నారు.ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర కన్వీనర్ వాణి రమావత్, కో–కన్వీనర్లు ఎన్.కవిత, కె.రజిత, నేత లు సరళ,అశ్విని,జ్యోతి,సరస్వతిలు పాల్గొన్నారు.

## 3న సీఎస్ఐ వెస్లీ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

హిమాయత్‌నగర్,నవంబర్28: క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి స్ఫూర్తిదాయకమైనదని తెలంగాణ గాడ్స్ విజన్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నెల్లమల్లి సికిందర్ తెలిపారు.గురువారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ మాత్రమేనన్నారు.డిసెంబర్ 3న సికింద్రాబాద్‌లోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో క్రిస్మస్ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నామని,ఈ వేడుకలకు మాజీ మంత్రి,ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్ హాజరవుతారని తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర నలుమూలల నుంచి క్రైస్తవులు అధిక సంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

## విద్యారంగ సమస్యలపై పీడీఎస్‌యూ నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 28: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యాశాఖకు మంత్రి లేకుండా సంవత్సరం గడుస్తుందని గుర్తు చేశారు. ఇప్పటి వరకు కనీసం ఒకసారి కూడా విద్యావ్యవస్థపై సమీక్ష నిర్వహించలేదని దుయ్యబట్టారు. గురుకుల, సంక్షేమ హాస్టళ్లు, జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత లేని కారణంగా విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్ గురై అస్వస్థత చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పాఠశాలలో మూడు సార్లు ఫుడ్ పాయిజన్ అయినా అధికారుల్లో ఎలాంటి మార్పు లేదని వాపోయారు.



పంజాగుట్టలోని శ్రీ దుర్గాభవాని ఆలయంలో కొలువుదీరిన శ్రీ మేధా దక్షిణామూర్తికి గురువారం వైభవంగా అన్నాభిషేకం నిర్వహించారు. 108 కిలోల అన్నంతో అభిషేకం చేశారు. కార్తీక మాసం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు అన్నాభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.– ఖైరతాబాద్

# దేశ ప్రగతికి సైన్స్ దోహదం

టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న వెంకటేశం

ఖైరతాబాద్, నవంబర్ 28 : దేశ ప్రగతికి సైన్స్ దోహదపడాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. చెకుముఖి సైన్స్ సంబరాల్లో భాగంగా రాజ్‌భవన్ సంస్కృతి భవన్‌లో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సైన్స్ దుర్వినియోగమైతే సమాజానికి చేటు జరుగుతుందన్నారు. పిల్లలు సైన్స్‌పై ఆసక్తి పెంచుకొని వాటి ఫలాలను సమాజంలోని అన్ని వర్గాలకు అందేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అవార్డు గ్రహిత చొక్కాపు వెంకటరమణ తన సైన్స్ మ్యాజిక్‌షోతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. అనంతరం చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్టులో విజేతలకు బుర్రా వెంకటేశం చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ రాధా, జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు చంద్రయ్య, గవర్నర్ డిప్యూటీ సెక్రటరీ జి. పల్లవి, జాయింట్ సెక్రటరీ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పుట్‌పాత్ వ్యాపారులకు న్యాయం చేయాలి



నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కౌసర్ మొహినుద్దీన్, మాజీద్‌హుస్సేన్

మెహిదీపట్నం, నవంబర్ 28 : నగరంలోని రోడ్లపై పోలీసులు చేపట్టిన ఆపరేషన్ రోప్ వల్ల ఎంతోమంది జీవనోపాధి కోల్పోతారని, అలాంటి వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలని కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కౌసర్‌మొహినుద్దీన్, మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. గురువారం నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలిసి పుట్‌పాత్ వ్యాపారాల తొలగింపుపై చర్చించారు. పుట్‌పాత్ వ్యాపారాలను తొలగిస్తున్న అధికారులు ముందుగా వారికి ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు.

నేడు, రేపు ఐఈఐలో

## జాతీయ సదస్సు

ఖైరతాబాద్, నవంబర్ 28 : ప్రొడక్షన్ ఇంజినీరింగ్ డివిజన్ బోర్డ్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని ది ఇనిస్టిట్యూషన్ ఇంజినీర్స్ ఇండియా తెలంగాణ స్టేట్ సెంటర్ ఆడిటోరియంలో నేడు, రేపు 'ఇన్నోవేషన్ ఇన్ గ్రీన్ సంస్థ అయిన బుల్ ప్రొడక్షన్, ప్రాక్టీసెస్ ఫర్ ఫ్యూచరిస్టిక్ ఇండస్ట్రీస్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐఈఐ చైర్మన్ వెంకట సుబ్బయ్య ఓ ప్రకటనలో తెలిపారు.
గ్రీన్ ఉత్పత్తుల వినియోగం, తయారీ తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు.

## సనత్‌నగర్ పాఠశాలలో చోరీ

### పోలీసులకు ఫిర్యాదు చేసిన హెచ్ఎం

అమీర్‌పేట్, నవంబర్ 28: సనత్‌నగర్ అశోక్‌కాలనీ ప్రభుత్వ పాఠశాలలో దొంగతనం జరిగింది. బుధవారం అర్ధరాత్రి జరిగినట్టుగా భావిస్తున్న ఈ ఘటనలో అగంతకులు గేటు నుంచి లోపలికి జొరబడి, రెండు గదుల తాళాలు పగులగొట్టారు. కీలకమైన కంప్యూటర్ ల్యాబ్ తలుపులు బద్దలు కొట్టేందుకు ప్రయత్నించారు. స్కూల్ ఆవరణలోని సీసీ కెమెరాలు సీసీ కెమెరాలతోపాటు విద్యుత్ ఫ్యూజ్ బాక్సును ధ్వంసం చేశారు. గురువారం ఉదయం పాఠశాలకు వచ్చిన తరువాత దొంగతనం జరిగిన విషయం తెలుసుకున్న హెచ్ఎం సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సనత్‌నగర్ పోలీసులతో పాటు క్లూస్ టీమ్ కూడా పాఠశాలను సందర్శించి వేలి ముద్రలు, ఇతరత్రా ఆధారాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పూలే ఆశయ సాధన కోసం పాటుపడాలి

సమావేశంలో నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న నటుడు జైహింద్ గౌడ్

ఖైరతాబాద్, నవంబర్ 28 : మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయ సాధన కోసం బీసీలు పాటుపడాలని బీసీ నేత, సినీ నటుడు జైహింద్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీఎఫ్ ఆవిర్భావ సభ గురువారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకోగా, ముఖ్య అతిథిగా హాజరైన సినీ నటుడు జైహింద్ గౌడ్ వారికి నియామకపత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా బీసీలు ఇంకా ఓటర్లుగానే ఉన్నారని, పాలకులుగా మారలేదన్నారు. ఆ పరిస్థితి మారాలని, రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ సమావేశంలో బీసీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్టల భూమేశ్, ప్రధాన కార్యదర్శి మహాతి రమేశ్ నాయీ, కార్యదర్శి ప్రశాంతి యాదవ్, మహిళా అధ్యక్షురాలు నీతా మహాలక్ష్మి, గౌరవ అధ్యక్షురాలు కొండ లతా బాయి తదితరులు పాల్గొన్నారు.

బడుగు,బలహీనవర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ కే.విప్లవ్ కుమార్‌తో సహా పలువురు నేతలు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. – బంజారాహిల్స్,నవంబర్ 28:

## నివాళి

మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త అని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పూలే వర్ధంతి సందర్భంగా ఎస్‌పీఆర్ హిల్స్ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్,నవంబర్ 28

## యువకుడి అదృశ్యం

నిఖిల్ (ఫైల్)

శంషాబాద్ రూరల్, నవంబర్ 28: యువకుడు అదృశ్యమైన ఘటన గురువారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది.
సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకా రం మండలంలోని నర్కూడ గ్రామానికి చెందిన గుడెపు నిఖిల్(22) డ్రైవిం గ్ చేస్తుంటాడు. బుధవారం కొండాపూర్‌లో డ్రైవింగ్ చేయడానికి ఇంట్లో చెప్పి వెళ్లిన యువకుడు సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడికి ఫోన్ చేయగా స్వ్చాఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు గురువారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వాళ్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### మైలార్‌దేవ్‌పల్లిలో

## రోడ్డు ప్రమాదం

మైలార్‌దేవ్‌పల్లి,నవంబర్ 28 :అతి వేగంగా కారు నడపడంతో ప్రమాదానికి గురైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోను, అర్జున్ అనే ఇద్దరు యువకులు మద్యం మత్తులో దుర్గ కన్వెన్షన్ వద్ద రెడి మిక్స్ లారీని అతి వేగంగా వచ్చి ఢీకొట్టారు.ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు.విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.కారులో మద్యం బాటిళ్లు ఉండటంతో మద్యం సేవించి కారు నడపడం వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చాని బావిస్తున్నారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

## 3న చిత్రకళా ప్రదర్శన

రవీంద్రభారతి, నవంబర్ 28 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, పికాసో దిస్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సంయుక్తంగా చిత్రకళ ప్రదర్శనను డిసెంబర్ 3న ఉదయం 11 గంటలకు రవీంద్ర భారతిలో నిర్వహిస్తున్నట్లు తెలుగు యూనివర్సిటీ పూర్వ విద్యార్థి ఉమేశ్వరి దీప బహదూర్, మారిషస్ తెలిపారు. తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు చిత్రకళా ప్రదర్శన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు మహేశ్, రమేశ్ బైరు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి : సీపీ అవినాష్ మహంతి

సమీక్షా సమావేశంలో పాల్గొన్న సీపీ అవినాష్ మహంతి

దుండిగల్, నవంబర్ 28 : పెండింగ్ కేసుల దర్యాప్తులో వేగం పెంచి త్వరితగతిన పరిష్కరించాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అన్నారు. గురువారం షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన బాలానగర్ జోన్ పోలీస్ అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం లో రిపోర్టైన కేసులు, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటి ల్లో ఎన్నికేసులు పరిష్కారమయ్యాయి, పెండింగ్ ఉన్న కేసులు ఎన్ని... ? వాటిని ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించిన ఆయన అందుకు కావాల్సిన దిశా నిర్దేశం చేశా రు. అదే విధంగా వివిధ లాంగ్ పెండింగ్ కేసులకు సంబంధించి ఇతర ముఖ్యమైన కేసుల గురించి రివ్యూ నిర్వహించారు. ఈ సమావేశంలో బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్, సైబర్ క్రైమ్ డీసీపీ, ఓఎస్‌డీ డీసీపీ, బాలానగర్ ఏసీపీ, కూకట్‌పల్లి ఏసీపీతో పాటు 8 పోలీస్ స్టేషన్‌లకు చెందిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, డీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

### పోచమ్మ తల్లి సన్నిధిలో వన భోజనాలు

శంషాబాద్‌లోని పోచమ్మ తల్లి సన్నిధిలో గురువారం కార్తీక మాస వన భోజనాలు జరిగాయి. నగరంలోని గచ్చిబౌలి గ్రామానికి చెందిన పలువురు మహిళలు అమ్మవారిని దర్శించుకొని భిన్న రకాలైన వంటకాలు చేసి, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి కార్తీక మాస మొక్కులు చెల్లించుకున్నారు. అంతే కాకుండా తల్లీ పిల్లా అంతా శక్తి స్వరూపిణి అయిన పోచమ్మ తల్లి సమక్షంలో భోజనాలు చేసుకొని తరించారు.

### ఎంఫిల్ ఇన్ రిహాబిలిటేషన్

## సైకాలజీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 28: ఓయూ పరిధిలోని ఎంఫిల్ ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ కోర్సు పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండో సంవత్సరం (పార్ట్–2) రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 11వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

### బీఫార్మసీ పరీక్షా

## ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 28: ఓయూ పరిధిలోని బీఫార్మసీ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) మొదటి, రెండు, మూడు, నాలుగు, అయిదు, ఆరో సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.